

కదంతొక్కిన అంగన్‌వాడీలు

- వేలాదిగా తరలివచ్చి కలెక్టరేట్ ముట్టడి
- బెదిరింపులకు భయపడం
- డిమాండ్లు పరిష్కరించే వరకు పోరాడతామని స్పష్టం



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కలెక్టరేట్, జనవరి 3: అంగన్‌వాడీ కార్యకర్తలు మరోసారి కదంతొక్కారు. 23 రోజులుగా సమ్మె చేస్తున్నా, ప్రభుత్వం మొండివైఖరి వీడడం లేదు. మరోవైపు అధికారుల బెదిరింపులకు నిరసనగా అంగన్‌వాడీలు వేలాదిగా తరలివచ్చి బుధవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. బెదిరింపులకు భయపడేది లేదని, డిమాండ్లు పరిష్కరించే వరకూ పోరాడతామని స్పష్టం చేశారు. హామీల అమలుకు, సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె.కళ్యాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ చెల్లించాలని తదితర డిమాండ్లతో వేలాదిమంది కలెక్టరేట్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేంద్రాలను తెరవకపోతే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని అధికారులు బెదిరించడం తగదని పేర్కొన్నారు. కేంద్రాల తాళాలు పగులకొట్టడం, నోటీసులు ఇవ్వడం, నిర్బంధాలకు పాల్పడడం దారుణమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలని, లబ్ధిదారులకు నాణ్యమైన సరుకులను సరఫరా చేయాలని, మెనూ ఛార్జీలను పెంచాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, ఎస్.కిషోర్ కుమార్, పి.అప్పారావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ప్రసాద్, జి.సింహాచలం, ఎస్ఎఫ్ఐ పలు సంఘాలు అంగన్‌వాడీ లకు మద్దతు తెలిపాయి. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భవిరి కృష్ణమూర్తి, కె.శ్రీనివాసు, అల్లు మహాలక్ష్మి, ఎన్‌వీ.రమణ, ఎస్.లక్ష్మీనారాయణ, అల్లు సత్యనారాయణ, ఎన్.గణపతి, ఈశ్వరరావు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్.హైమవతి, పి.లతాదేవి, జె.కాంచన, కె.సుజాత, ఆదిలక్ష్మి, శాంతామణి, మాధురి పాల్గొన్నారు.

నేడు జిల్లాలో 'నిజం గెలవాలి'

- చంద్రబాబు అక్రమ అరెస్ట్‌తో ఆగిన గుండెలు
- మృతుల కుటుంబాలను పరామర్శించనున్న భువనేశ్వరి

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)



నారా భువనేశ్వరి

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం జిల్లాలో పర్యటించనున్నారు. కొన్నాళ్ల కిందట స్కిల్‌డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అక్రమ అరెస్టుతో జిల్లాలో ముగ్గురు టీడీపీ కార్యకర్తలు మనస్తాపం చెంది మృతి చెందారు. నవంబరులో ఆయా కుటుంబాలను పరామర్శించేందుకు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి 'నిజం గెలవాలి' పేరుతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అయితే చంద్రబాబుకి బెయిల్ లభించడంతో తాత్కాలికంగా ఈ కార్యక్రమం వాయిదా వేశారు. గురువారం ఉమ్మడి జిల్లాలో ఎచ్చెర్ల, ఆమదాలవలస, పాలకొండ నియోజకవర్గాల్లో ఆమె పర్యటించనున్నారు. గురువారం ఉదయం 10.30గంటలకు ఎచ్చెర్ల నియోజకవర్గం జి.సిగడాం మండలం దవళపేటలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తారు. అనంతరం పాలకొండ నియోజకవర్గంలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 2.25గంటలకు ఆమదాలవలస నియోజకవర్గం బూర్జ మండలం తోటవాడలో ఓ కుటుంబాన్ని పరామర్శిస్తారు. తర్వాత ఆమదాలవలస మండలం దన్నానపేటలో 3 గంటలకు, పాతనిమ్మతోట్లవాడ గ్రామంలో 3.25 గంటలకు పర్యటిస్తారు. సాయంత్రం 6.40 గంటలకు విశాఖపట్నం చేరుకుంటారు. భువనేశ్వరి పర్యటన విజయవంతం చేసేందుకు జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టింది. భారీ ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు 'నిజం గెలవాలి' కార్యక్రమంలో పాల్గొనున్నారు.



వన్ డిస్ట్రిక్ట్ వన్ అవార్డు అందుకున్న కలెక్టర్

కేంద్రప్రభుత్వం ప్రకటించిన వన్ డిస్ట్రిక్ట్ వన్ అవార్డుల్లో భాగంగా పొందూరు కాటన్ చీరకు అవార్డు దక్కింది. ఢిల్లీలో బుధవారం నిర్వహించిన ఏడీఓపీ అవార్డుల ప్రదానోత్సవంలో కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్, వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి పీయూష్ గోయల్ చేతుల మీదుగా కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లఠ్కర్ ఈ అవార్డును అందుకున్నారు. జిల్లాకు ఈ అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

\- కలెక్టరేట్

ట్రైకార్ లేనట్టే!

- గిరిజన నిరుద్యోగులకు అందని రుణాలు
- స్వయం ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు



సీతంపేట ఐటీడీఏ కార్యాలయం

- మెళియాపుట్టి మండలం వెంకటాపురానికి చెందిన బందపల్లి ఈశ్వరరావు డిగ్రీ చదివాడు. ఉద్యోగం లేకపోవడంతో స్వయం ఉపాధితో జీవనం సాగించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో ఆటో లేదా కారు కొనుగోలు చేసేందుకు గత మూడేళ్లుగా ఐటీడీఏలోని ట్రైకార్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నాడు. కానీ ఇంతవరకూ రుణాలు మంజూరు కాలేదు. దీంతో చేసేది లేక ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు.

- మెళియాపుట్టి మండలం గొట్టిపల్లికి చెందిన గొందర లక్ష్మీనారాయణ అనే దివ్యాంగుడు డిగ్రీ పూర్తిచేశాడు. గ్రామంలో కిరాణా షాపు పెట్టుకునేందుకు ఆర్థిక సహాయం కోసం కొన్నాళ్ల కిందట ట్రైకార్ రుణాలకు దరఖాస్తు చేసుకున్నాడు. కానీ ఇంతవరకూ రుణాలు మంజూరు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

(మెళియాపుట్టి)

'నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తాం. గిరిజనులు ఇతర ప్రాంతాలకు వలస పోకుండా ఉపాధి చూపిస్తాం. స్వయం ఉపాధి పొందేలా రుణాలు మంజూరు చేసి ప్రోత్సహిస్తాం' అని ఎన్నికల ముందు సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి మాట మరిచారు. దీంతో గిరిజన నిరుద్యోగులకు ఉపాధి కరువవుతోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో గిరిజన నిరుద్యోగ యువతకు ట్రైకార్ రుణాలు మంజూరు చేసేవారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, స్వయం ఉపాధి రంగాలకు సంబంధించి 22 రకాల యూనిట్లు మంజూరు చేసేవారు. స్వయం ఉపాధిపై ఆసక్తి ఉన్న యువత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే మండలస్థాయి కమిటీ సభ్యులు అర్హులను ఎంపిక చేసి.. బ్యాంకుల ద్వారా రుణాలు అందజేసేవారు. ఇలా.. గత ప్రభుత్వ హయాంలో 3,721 యూనిట్లకు సంబంధించి 3,174 మందికి వివిధ రుణాలు అందజేశారు. యువకులు ఆసక్తి ఉన్న రంగాల్లో పెట్టుబడి పెట్టి.. స్వయం ఉపాధి పొందేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రైకార్ రుణాల ఊసే లేదు. ట్రైకార్ కార్పొరేషన్ ఛైర్మన్, సభ్యులుగా వైసీపీ నాయకులకు పదవులు కట్టబెట్టినా ప్రయోజనం కనిపించడం లేదు. ఉదాహరణకు మెళియాపుట్టి మండలం కరజాడ ప్రాంతానికి చెందిన సుభాష్‌కు ట్రైకార్ డైరెక్టర్ పోస్టు ఇచ్చినా ఒక్కరికి కూడా రుణం మంజూరు చేసిన దాఖలాలు లేవు. దీంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి ట్రైకార్ రుణాలు మంజూరు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై మెళియాపుట్టి ఎంపీడీవో చంద్రకుమారి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. గిరిజన యువత రుణాల కోసం చేసుకున్న దరఖాస్తులను ఐటీడీఏకు పంపించామన్నారు. ప్రస్తుతం ట్రైకార్ రుణాలు మంజూరు కావడం లేదని తెలిపారు.

రాళ్లు వేశారు.. తారు మరిచారు!

- మూడేళ్లుగా సాగుతున్న రోడ్డు విస్తరణ
- బిల్లుల చెల్లింపులో జాప్యం
- రాకపోకలకు అంతరాయం

(వజ్రపుకొత్తూరు)



అక్కుపల్లి వద్ద రోడ్డుపై రాళ్లు తేలి..

వజ్రపుకొత్తూరు నుంచి అక్కుపల్లి మీదుగా రోడ్డు విస్తరణ పనులు మూడున్నరేళ్లుగా కొనసాగుతున్నాయి. రూ.16 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై రాళ్లు వేసి తారు వేయకుండా పనులు నిలిపివేయడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మరోవైపు రోడ్డుపై దుమ్ము, ధూళి చెలరేగడంతో శ్వాసకోశ వ్యాధులు సంభవిస్తాయోమోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ప్రధాన రహదారి పనులు నత్తనడకన సాగుతున్నా.. అధికారులు, పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి పనులు పూర్తిచేయాలని కోరుతున్నారు. కాగా కాంట్రాక్టర్‌కు బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో పనులు ఆలస్యమవుతున్నట్టు తెలుస్తోంది. ఈ విషయమై ఆర్అండ్‌బీ జేఈ విక్రమ్ వద్ద ప్రస్తావించగా.. రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా రాళ్లు తేలిన చోట గ్రావెల్ వేశామని తెలిపారు.

ఇబ్బందులు పడుతున్నాం



అక్కుపల్లి రోడ్డు పనులు మూడున్నరేళ్లు అయినా పూర్తికాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. రోడ్డుపై రాళ్లు తేలి ఉండడంతో ద్విచక్రవాహనాలు బోల్తా పడి గాయాల పాలవుతున్నాం. ఈ రోడ్డు విషయంలో అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోకపోవడం బాధాకరం.

\-రెయ్యి గున్నయ్య, పల్లిసారధి

పనులు పూర్తిచేయాలి



మండలంలో ప్రధాన రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు పూర్తికాక పోవడంతో రోడ్డుపై దుమ్ము, ధూళి కారణంగా ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలి.

\-సూరాడ మోహనరావు, టీడీపీ మండల అధ్యక్షుడు, అక్కుపల్లి

రాత్రంతా నేలబావిలోనే..

- ప్రమాదవశాత్తు నూతిలో పడిన వ్యక్తి
- బిక్కుబిక్కుమంటూ గడిపిన వైనం
- 17 గంటల తర్వాత క్షేమంగా బయటకు..

టెక్కలి రూరల్, జనవరి 3: చుట్టూ చీకటి. ఓ వైపు విపరీతమైన మంచు. మరోవైపు ఎముకలు కొరికే చలి. అంతటా నిశ్శబ్దం. కాపాడండి.. కాపాడండి అని కేకలు వేస్తున్నా.. ఎవరికీ వినిపించని వైనం. ప్రాణాలతో బయటపడతానో లేదోనన్న కలవరం. ఇదీ.. ప్రమాదవశాత్తు నేలబావిలో పడిన ఓ వ్యక్తి భయాందోళన. సుమారు 17 గంటల పాటు బావిలోనే బిక్కుబిక్కుమంటూ గడిపి.. చివరకు పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సహకారంలో ప్రాణాలతో సురక్షితంగా బయటపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివీ. టెక్కలి ఆదిఆంధ్రావీధికి చెందిన ఉర్జాన శంకర్‌రావు(బుడ్డు) అనే 40 ఏళ్ల వ్యక్తి ప్రమాదవశాత్తు వీరరామకృష్ణాపురం గ్రామంలోని నేలబావిలో జారిపడ్డాడు. మంగళవారం రాత్రంతా నేలబావిలోనే బిక్కుబిక్కుమంటూ గడిపాడు. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో వీరరామకృష్ణాపురంలోని తోటల్లోకి వెళ్లగా.. అక్కడ నేలబావిని గమనించకపోవడంతో ప్రమాదవశాత్తు అందులో జారిపడ్డాడు. అప్పటికే చీకటి పడడంతో గ్రామస్థులు ఎవరూ సమీపంలో లేరు. నేలబావిలో పడిపోయిన శంకర్‌రావు.. కాపాడండి.. కాపాడండి అని కేకలు వేసినా ఎవరికీ వినిపించలేదు. దీంతో మంగళవారం రాత్రి అంతా ఆ నేలబావిలోనే చలికి వణుకుతూ.. గజగజలాడిపోయాడు. బుధవారం ఉదయం 11 గంటల సమయంలో నేలబావి నుంచి కేకలు వినిపించడంతో అటుగా వెళ్లిన గ్రామస్థులు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి టెక్కలి ఎస్ఐ-2 కె.రమేష్‌బాబు చేరుకుని స్థానిక అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. దీంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అతికష్టం మీద తాళ్ల సహాయంలో శంకర్‌రావును బయటకు తీశారు. అయనకు స్వల్ప గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నేలబావిలో పడిపోయిన వ్యక్తిని బయటకు తీసిన సిబ్బందిని స్థానికులు అభినందించారు. చుట్టూ రాళ్లు ఉన్న నేలబావిలో పడి.. క్షేమంగా బయటకు వచ్చిన శంకర్‌రావును మృత్యుంజయుడుగా స్థానికులు వ్యాఖ్యానించారు.



నేలబావిలో పడిన శంకర్‌రావు

బకాయిలు చెల్లించాలి

- యూటీఎఫ్ నాయకుల పోరుబాట
- కలెక్టరేట్ వద్ద ధర్నా



ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అరసవల్లి, జనవరి 3: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని కోరుతూ యూటీఎఫ్ నాయకులు పోరుబాట పట్టారు. బుధవారం కలెక్టరేట్ వద్ద 12 గంటల ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర, ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా జేఏసీ నాయకుడు హనుమంతు సాయిరాం మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపించారు. 'వైసీపీ అధికారంలోకి వస్తే ప్రతినెలా 1న జీతం, మెరుగైన పీఆర్సీ, సకాలంలో డీఏ, ఉద్యోగ.. ఉపాధ్యాయుల్లో స్నేహపూరిత వాతావరణం కల్పిస్తామని ఎన్నికల్లో వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఇవేవీ సక్రమంగా అమలు కావడం లేదు. కనీసం జీతాలు కూడా ప్రతినెలా 1న చెల్లించడం లేదు. 17వ తేదీ వరకు జీతాలు, పెన్షన్ల కోసం ఎదురుచూడాల్సి పరిస్థితి దాపురించింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులు దాచుకున్న పీఎఫ్, ఏపీజీఎల్ఐ, సరెండర్ లీవ్ చెల్లింపులు కూడా పెండింగ్‌లో ఉంచడం దయనీయం. ఆగస్టు 24న జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సెప్టెంబరు -2023 నాటికి అన్ని బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇంతవరకు ఎటువంటి చెల్లింపు చేయలేదు. ఇప్పటివరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలు రూ.20వేల కోట్ల వరకు చేరుకుందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. తక్షణమే బకాయిలు విడుదల చేయాలి. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 9, 10 తేదీల్లో విజయవాడలో 36గంటల ధర్నా కార్యక్రమం నిర్వహిస్తామ'ని వారు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి, రాష్ట్ర నాయకులు గొంటి గిరిధర్, బి.ధనలక్ష్మి, కె.దాలయ్య, బి.రవికుమార్, హనుమంతు అన్నాజీరావు, బి.శంకర్రావు, జి.నారాయణరావు శ్రీరామచంద్రమూర్తి, ఎంవి. రమణ, జి.సురేష్, శ్రీనివాసరావు భాస్కరరావు, రాష్ట్ర కౌన్సిలర్లు వై.ఉమాశంకర్, బి.చిట్టిబాబు, ఏపీటీఎఫ్ నాయకులు బి.రవికుమార్, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు ధనుంజయరావు, బీఎస్ఎన్ఎల్ నాయకుడు పాణిగ్రాహి, జనార్దనరావు, చింతాడ రామారావు పాల్గొన్నారు.



సమగ్రశిక్ష ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన

కలెక్టరేట్, జనవరి 3 : సమగ్రశిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె 15వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ సమీపంలోని మహాత్మా జ్యోతిబాపూలే పార్కు వద్ద శిబిరంలో ఉద్యోగులు బుధవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ గొంటి గిరిధర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. సమగ్రశిక్ష అన్ని విభాగాల్లోని ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. సమ్మెలో పాల్గొంటున్న కేజీబీవీ ఉపాధ్యాయులు విధుల్లో చేరకపోతే తొలగిస్తామని నోటీసులు అందించడం దారుణమని రావాడ అరుణకుమారి, చీపురుదేవి, బెండి భారతి, పెంకి చాముండేశ్వరి పేర్కొన్నారు. అందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష జేఏసీ జిల్లా అధ్యక్షుడు పైడి మురళీకృష్ణ, కోశాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కళ్లు మూసుకుని.. మునిసిపల్ కార్మికుల నిరసన

అరసవల్లి, జనవరి 3: సమస్యల పరిష్కారంపై ఆందోళన చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంతో మునిసిపల్ కార్మికులు కళ్లు మూసుకుని వినూత్న నిరసన తెలిపారు. బుధవారం 9వ రోజు సమ్మెలో భాగంగా శ్రీకాకుళం కార్పొరేషన్ కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు, అరుగుల గణేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.బలరాం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచుకుని తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.



సమస్య మళ్లీ మొదటికి..!

- గొడ్డ-అంపురం మధ్య రోడ్డు తవ్వేశారు
- గిరిజన గ్రామాలకు రాకపోకలు బంద్
- జిరాయితీ భూమిలో రోడ్డు వేయడంతోనే...


రోడ్డును ఎక్స్‌కవేటర్‌తో తవ్విన దృశ్యం

మెళియాపుట్టి, జనవరి 3: గొడ్డ-అంపురం రోడ్డు సమస్య మళ్లీ మొదటికి వచ్చింది.. 15 ఏళ్ల కిందట గొడ్డ జంక్షన్ నుంచి రింపి మీదుగా పాతపట్నం మండలం బడ్డుమర్రి వరకు ఐటీడీఏ నిధులతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. అయితే ఈ మార్గంలో ఒక రైతుకు సంబంధించిన జిరాయితీ ఉండగా దానిమీదుగా రోడ్డు వేశారు. అయితే సదరు రైతు తన పొలంలో రోడ్డు తవ్వి చదును చేస్తుండడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. దీంతో అనంతగిరి, ఏగువలనంతగిరి, రింపి, మూలరింపి, అంపురం, బంజరు, గొందర పేట గ్రామాలకు రాకపోకలు లేక వాహనదార్లు ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా గత ఏడాది ఆగస్టులో ఇలాగే జరగడంతో ఎంపీడీవో చొరవతో రోడ్డు వేశారు. అయితే సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతిని అనేక పర్యాయాలు కోరినా ప్రయోజనం కనిపించడం లేదని ఇలాపురం సర్పంచ్ గవిరేస్ ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సైతం వాహనాలు రాలేక ఇబ్బం దులు పడుతున్నట్లు పేర్కొన్నారు. మళ్లీ బుధవారం సదరు రైతు ఎక్స్‌కవేటర్‌తో రోడ్డును తవ్వడం తో గిరిజనులు ఆవేదన వ్యక్తంచేశారు. అధికారులు స్పందించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని వారు కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో చంద్రకుమారిని వివరణ కోరగా సంబంధిత యజమానితో చర్చించి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. గత ఏడాది నుంచి ఇదే పరిస్థితి ఉందని, అధికారుల దృష్టికి తీసుకువెళ్లి రాకపోకలు సాగించేలా కృషి చేస్తామన్నారు.

టీడీపీ-జనసేన విజయమే లక్ష్యం

- జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం



పలాస: కేటీ రోడ్డు ఎస్‌బీఐ జంక్షన్ వద్ద జనసేన పార్టీ కార్యాలయాన్ని బుధవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వి.దుర్గారావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు తిప్పాన దుర్యోధన రెడ్డి, బైపల్లి ఈశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2024 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేస్తామన్నారు. కిడ్నీ వ్యాధులను ప్రపంచానికి చూపించి ఉద్దానం ప్రాంత మార్గదర్శకుడిగా పవన్ కల్యాణ్ నిలిచారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడిగా పోటీ చేసి విజయం సాధిస్తుందనే ధీమాను వ్యక్తంచేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు దాసరి రాజు, పేడాడ రామ్మోహనరావు, ఎన్ని రాజు, ప్రవీణ్‌కుమార్, కె.గోపాలరావు, దిలీప్‌కుమార్ పాణిగ్రాహి పాల్గొన్నారు.

విధులకు హాజరుకండి



పలాస: సమ్మె విరమించి విధులకు హాజరుకావాలని మునిసిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ కోరారు. బుధవారం పారి శుధ్య కార్మికుల సంఘ నేతలతో తన చాంబర్‌లో చర్చలు నిర్వహించారు. సమ్మె చేపట్టి ఇప్పటికే 8 రోజులైందని, వార్డుల్లో చెత్త పేరుకు పోతుండడంతో ప్రజారోగ్యం దెబ్బతింటోం దన్నారు. కార్మికుల సమస్యలు ప్రభుత్వం దృష్టిలో పరిష్కారదిశలో ఉన్నాయని, సమ్మె విరమించి పనుల్లో చేరాలని కోరారు. కార్మిక సంఘ నాయకుల మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా తాము సమ్మె నిర్వహిస్తున్నామని, తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకుడు మురుగన్, కార్మికులు పాల్గొన్నారు.

టీడీపీ ఫ్లెక్సీని చించేసిన గుర్తు తెలియని వ్యక్తులు



వజ్రపుకొత్తూరు: గరుడభద్ర పంచాయతీ తర్లాగడివూరులో టీడీపీ ఫ్లెక్సీని మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చించివేయడంపై ఆ పార్టీ కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలు పుతూ నాయకులు ఫొటోలతో దీనిని ఏర్పాటు చేశామని, కొందరు గిట్టని వారే చించివేసి ఉంటారని కోనేరు ఆదినారాయణ తెలిపారు. శాంతి యుతంగా, ఐక్యంగా ఉండే గ్రామంలో ఈ విధమైన చర్యలు ఎంతమాత్రం భావ్యం కాదని, ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గ్రామాల్లో అయోధ్య అక్షింతలు పంపిణీ


కోటబొమ్మాళి: అక్షింతలను ఊరేగిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: హరిశ్చంద్రపురం పంచాయతీలో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను బుధవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మెట్ట తిరుమలరావు, రామాలయ గురుస్వామి ఉప్పాడ పూర్ణారావు, ఉప్పాడ లక్ష్మణరావు, కోట రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు. ● **జలుమూరు:** అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను బుధ వారం గ్రామంలో ఊరేగించారు. ఇంటింటికీ వెళ్లి వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు రొక్కం కృష్ణారావు, ఎన్.జోగారావు, ప్రసాదరావు, శంకరరావు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్ల 'ఓవర్'

- కిరాయి దోపిడీతో లారీ యజమానులకు అన్యాయం
- 20 టన్నుల లారీకి 9 టన్నులు అదనం
- సిండికేట్‌గా మారిన మిల్లుల యజమానులు


వేర్ హౌసింగ్ గిడ్డంగికి ఓవర్ లోడ్‌తో వచ్చిన లారీలు

నరసన్నపేట, జనవరి 3: మిల్లు నుంచి ఎఫ్‌సీఐకి బియ్యం తీసుకువెళ్లే లారీల యజమానులను మిల్లర్లు దోపిడీ చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో పలు రైస్ మిల్లుల నుంచి ఫుడ్ కార్పొ రేషన్ గిడ్డంగులకు బియ్యం సరఫరా చేస్తారు. ఈ రవాణాలో మిల్లర్లు సిండికేట్‌గా మారి పరిమితికి మించి లోడింగ్ చేస్తుండడంతో లారీ యజమానులు అన్యాయానికి గురవుతున్నారు. 20 టన్నుల సామర్థ్యం కలిగిన లారీకి అదనంగా 9 టన్నులు కలిపి 29 టన్నులు లోడింగ్ చేసి ఎఫ్‌సీఐ వద్ద పూర్తిగా ఆ మేరకు ఎఫ్‌సీఐ నుంచి మొత్తం పొందుతున్నారు. కాని లారీ యజమానులకు మాత్రం 20 టన్నులకే కూలి చెల్లిస్తూ నిలువు దోపిడీ చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఒకవేళ రవాణా శాఖ అధి కారుల తనిఖీ సమయంలో ఓవర్ లోడ్‌తో దొరికితే తామే బాధ్యత వహించాల్సి వస్తోందని వాపోతున్నారు. మిల్లర్ల తీరుతో 30 టన్నుల సామర్థ్యం కలిగిన లారీలు లోడింగ్ లేక మూలన పడ్డాయని గగ్గోలు పెడుతున్నారు. ఎంత సామర్థ్యం గల లారీలకు అంతే మేర బియ్యం లోడింగ్ చేస్తామని చెప్పినా మిల్లర్లు ఓవర్ లోడింగ్ వేసే లారీలనే బుక్ చేస్తున్నారని, దీంతో పెద్ద లారీలకు లోడింగ్ లేకుండా పోతోందని కొందరు లారీ యజమానులు 'ఆంధ్రజ్యోతి' వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. ఎఫ్‌సీఐకి ధాన్యం పంపే లారీలపై అధికారులు దృష్టి సారించి నిబంధనలు అమలయ్యేలా చూసి మాకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు. దీనిపై సీఐ బి.ప్రసాదరావును వివరణ కోరగా నిబంధనల మేరకే లోడింగ్ ఉండాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీ-జనసేన కూటమికి అండగా నిలవాలి


మదనాపురంలో భవిష్యత్తుకు గ్యారెంటీలో పాల్గొన్న టీడీపీ నాయకులు

జలుమూరు (సారవకోట): టీడీపీ-జనసేనపార్టీ కూటమికి అండగా నిలిచి రాష్ట్రాభివృద్ధికి సహక రించాలని టీడీపీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ కోరారు. సత్రాం పంచాయతీ గొల్లపేట లో బుధవారం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. నక్క తవిటినాయుడు, కల్యాణం శివ, యు.పాపారావు పాల్గొన్నారు. ● మదనాపురం గ్రామంలో స్థానిక టీడీపీ నేత పిట్ట అప్పారావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జి సాధు చిన్ని కృష్ణంనాయుడు, నాయకులు పిల్లా నందకిశోర్, తాడేల భీమారావు, డి.జయరాం పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు సీఎం కావాలి

తోటాడ(పోలాకి): రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి సాధించాలంటే టీడీపీ అధినేత చంద్రబాబును మళ్లీ సీఎంగా చేయాలని టీడీపీ నేతలు బైరి బాస్కరరావు, ఎంవీ నాయుడు, తెలిపారు. బుధవారం రాత్రి వారు తోటాడ, గొల్లలవలస గ్రామాల్లో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుత సీఎం జగన్ నిరంకుశపాలన సాగుతోందని, దీనిపై ప్రజలు విసుగెత్తిపోతున్నారన్నారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోను వివరించారు. కార్యక్రమంలో బి.భాస్కరరావు, తర్ర అప్పల నాయుడు, అలిగి రామారావు, పంచిరెడ్డి సింహాచలం, పంగ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బాబుతోనే రాష్ట్రాభివృద్ధి

నందిగాం: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యపడుతుందని టీడీపీ ఎస్సీ సెల్ నియోజకవర్గ ప్రతినిధి, నందిగాం మాజీ సర్పంచ్ అక్కురాడ కూర్మారావు అన్నారు. బుధవారం నందిగాం దండాసి వీధిలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి టీడీపీ మేనిఫెస్టోపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో మట్ట ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.


తోటాడలో బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు


నందిగాంలో భవిష్యత్‌కు గ్యారెంటీ కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి


అప్పడాల తయారీని పరిశీలిస్తున్న దృశ్యం

సంతబొమ్మాళి: మహిళ సంఘాల సభ్యులు ఆర్థిక స్వావలంబన సాధించే దిశలో జీవనోపాధి యూనిట్లు నిర్వహించాలని సెర్ప్ డైరెక్టర్ పద్మావతి అన్నారు. బుధవారం ఆమె మండలంలో పర్యటించి మహిళా సంఘ సభ్యులు నిర్వహిస్తున్న జీవనోపాధి యూనిట్లను పరిశీలించారు. ఇటువంటి యూనిట్ల ఏర్పాటుకు రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ఆర్థిక, సాంకేతిక సహకారం అందిస్తుందన్నారు. దండుగోపాలపురంలో అప్పడాల తయారీ, వడ్డితాండ్రలో పెరటి కోళ్ల పెంపకం యూనిట్లను పరిశీలించారు. కార్యక్ర మంలో సెర్ప్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, జిల్లా లైవ్‌స్టాక్ డీపీఎం డా.సన్యాసిరావు, టెక్కలి ఏరియా కో-ఆర్డినేటర్ శ్రీరాములు, ఏపీఎం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.● **టెక్కలి రూరల్:** పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ పథకాల కింద ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి యూనిట్లను బుధవారం సెర్ప్ జీవనోపాధుల విభాగం డైరెక్టర్ పద్మావతి, ఏడీలు శ్రీనివాసరావు, సుధాకర్ పరిశీలించారు. స్థానిక రేవతీపతి వీధిలోని పిండి, ఆయిల్ మిల్లుతో పాటు పోలవరంలో ఏర్పాటు చేసిన మదర్ పౌల్ట్రీ యూనిట్లను పరిశీలించారు. ● **బీసీ కాలనీ (పోలాకి):** ఉపాధి కల్పించాలన్న ఉద్దే శంతో రూ.19 లక్షలతో 460 పౌల్ట్రీయూనిట్లను ఎస్‌హెచ్‌జీల కు మంజూరు చేశామని సెర్ప్ డైరెక్టర్ జి.పద్మావతి వెల్లడించారు. బుధవారం ఆమె పోలాకి బీసీకాలనీ, రుంకు జగన్నాథపురం, మగతపాడు గ్రామాల్లో మంజూరు చేసిన యూనిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

'నిజం గెలవాలి'లో సిక్కోలు టీడీపీ నాయకులు


నారా భువనేశ్వరితో సిక్కోలు నాయకులు

అరసవల్లి: 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి బుధవారం విజయనగరం జిల్లా బొబ్బిలి నియోజకవర్గం పెరుమాళిలో పర్యటించి బాధితులను పరామర్శించారు. చంద్రబాబు అరెస్టు సమయంలో మరణించిన కుటుంబ సభ్యులను పరామర్శించేదుకు తలపెట్టిన ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు, శ్రీకాకుళం మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వంశధార నిర్వాసితులకు న్యాయం చేస్తాం: కలమట


మాట్లాడుతున్న కలమట రమణ

హిరమండలం: రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి అధికారంలోకి రాగానే వంశధార నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇచ్చి న్యాయం చేస్తామని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. బుధవారం సుభలయ ఆర్అర్ కాలనీ పంచాయతీ కమ్యూనిటీ భవనంలో వంశధార నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంశధార నిర్వాసితులకు సీఎ జగన్ రెడ్డి ఎన్నికల సమయంలో 2013 భూ సేకరణ చట్టం అమలు చేస్తామని హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. రాష్ట్ర ప్రజలను నమ్మించి గొంతుకోసిన జగన్‌కు రానున్న ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. టీడీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పి.బుచ్చిబాబు, సర్పంచ్ లంక రోజారాణి, టీడీపీ మండల అధ్యక్షుడు చెట్టు శ్రీనివాసరావు, నేతలు కొర్ను సింహా చలం, బర్రి సురేష్, దారపు డిల్లేశ్వరరావు, ఎస్.గోవిందరావు, గణేష్, మామిడి గణపతిరావు తది తరులు పాల్గొన్నారు.

గ్రామకంఠం భూమిలో ఇళ్ల స్థలాలివ్వాలి

మెళియాపుట్టి: పెద్దమడి కాలనీలోని గ్రామకంఠం భూముల్లో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని దండకారణ్య గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సవర కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గిరిజనులతో కలిసి తహసీల్దార్ పి.సరోజినికి వినతిపత్రం బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామానికి ఆనుకొని సర్వే నెంబర్ 7-2లో ప్రభుత్వం భూమి ఉందని, అధికంగా గిరిజనులు స్థలాలు లేక ఇళ్లు కట్టుకోలేని పరిస్థితి నెలకొన్నందున సర్వే చేసి పట్టాలివ్వాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో లోకేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల్లో స్పెషల్ ఫీజులు తగ్గించాలి


వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ నేతలు

పలాసరూరల్: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పెంచిన స్పెషల్ ఫీజులను తగ్గించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస ఆర్డీవో కార్యాల య ఏవో సుమతికి వినతిపత్రం బుధవారం అందజేశారు. ఓఎస్ పే యాప్‌ను, కాలేజ్ డెవలప్‌మెంట్, పెంచిన స్పెషల్ ఫీజులను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు విజయ్, జీవన్, మధు, భగవాన్, సునీల్ పాల్గొన్నారు

పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వినోద్

పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మద్దిల వినోద్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నెల్లూరులో శెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర మహాసభలో ఈ మేరకు ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆయనను పలువురు యువకులు అభినందించారు.

నిర్దేశిత లక్ష్యాలను సాధించాలి

పాతపట్నం: నిర్దేశిత లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలని ప్రాంతాయ పశువైద్య కేంద్రం ఏడీ డా.మంచు కరుణాకరరావు అన్నారు. గాలికుంటువ్యాధి నివారణా టీకాల మాసోత్సవాన్ని గ్రామాల్లో బుధ వారం ప్రారంభించారు. సీది, తీమర, కాగువాడ గ్రామాలలో టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో 31,094 పశువులకు గాను 27,368 పశువులకు నిర్దేశం విధించామన్నారు. నాలుగు నెలలు దాటిన పశువులకు ఈ టీకాలు వేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లి జగదీశ్వర రావు, పశు వైద్యాధికారి పి.అనిల్ తదితరులు పాల్గొన్నారు. ● **కోటబొమ్మాళి:** కురుడు పంచాయతీ రామయ్య పేటలో బుధవారం గాలికుంటువ్యాధి టీకాలను వేశారు. 146 పశువులకు టీకాలు వేసినట్లు డాక్టర్ లఖి నేని కిరణ్ కుమార్ తెలిపారు. ● **మందస:** కొత్తపల్లి గ్రామంలో బుధవారం పశువైద్యశిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి డి.శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఈనెల 31లోగా ఉచితంగా పశు వులకు టీకాలు వేయనున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దానయ్య సర్పంచ్ జి.వెంకట్రావు, ఎంపీటీసీ సభ్యుడు డి.కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

నరసన్నపేట: పట్టణంలో 12వ వార్డు పరిధి జోగిచెరువులో కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, తక్షణం స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వార్డు సభ్యుడు, టీడీపీ నాయకులు గొలివి రామారావు బుధవారం ఈవో చిన్నారావుకు ఫిర్యాదు చేశారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలపై గత కొన్నా ళ్లుగా ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించాలని ఆయన కోరారు. 12వ వార్డులో పూర్తిస్థాయిలో మౌలిక వసతులను కల్పించాలని కోరారు.

బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

సంతబొమ్మాళి: జగన్నాథపురంలో రూ.లక్షల వ్యయంతో నిర్మించనున్న వంతెనకు టెక్కలి వైసీపీ ఇన్‌చార్జి, జడ్పీటీసీ దువ్వాడ వాణి బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, పీఏసీఎస్ చైర్మన్ జగన్నాయకులు, సర్పంచ్ రాములమ్మ, ఎంపీటీసీ సవర రాజు పాల్గొన్నారు.

రేపు నారాయణవలస సంత బహిరంగ వేలం

కోటబొమ్మాళి: నారాయణవలస సంత బహిరంగ వేలం గురువారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంపాటలో పాల్గొనవచ్చన్నారు.

ఈవీఎం, వీవీ ప్లాట్లపై అవగాహన

నందిగాం: ఈవీఎం, వీవీ ప్లాట్లపై ఓటర్లకు బుధవారం అవగాహన కల్పించారు. కలెక్టర్ శ్రీకేష్ బాలాజీ లాఠ్కర్ ఆదేశాల మేరకు తహసీల్దార్ వైవీ పద్మావతి ఆధ్వర్యంలో నందిగాం హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో వీటి పనితీరు, వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐ పి.కిరణ్, ఎన్నికల సీవో శ్యామ్, ఈఆర్‌వోలు ఎ.ప్రవీణ్, బి.తారకేశ్వరరావు, అనంతరావు, దేవేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విజయకుమార్‌ని స్ఫూర్తిగా తీసుకోవాలి

జలుమూరు (సారవకోట): ఎస్ఐగా ఎంపికైన విజయకుమార్‌ని స్ఫూర్తిగా తీసుకొని యువకులు ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. సారవకోటలో బుధవారం విజయ కుమార్‌ను ఆయన సత్కరించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వ్యాసరచన, జానపద కథల పోటీలు

పలాసరూరల్: పలాస మండలం రంగోయి గ్రామానికి చెందిన గిడుగు రామమూర్తి తెలుగుభాష, జానపద కళాపీఠం, బద్రి అప్పన్న స్మారక పీఠం 20 వసంతాల సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, జానపద కథల పోటీలను నిర్వహిస్తున్నట్లు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బద్రి కూర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. 3, 4, 5 తరగతులకు తెలుగు పద్యపఠనం- భావాలతో అప్పగించడం, 6, 7 తరగతులకు తెలుగుభాష తీయదనం, 8, 9, 10 తరగతులకు తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే జానపద కళల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు ఈ నెల 6వతేదీలోగా 97011 51207, 77028 38118, 97045 70597 నెంబర్లకు పోటీ చేసే వారి వివరాలను పంపాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

వేర్వేరు ఘటనల్లో రైళ్లు ఢీకొని ఇద్దరి మృతి

● ఒకరు ప్రభుత్వ ఉద్యోగి.. మరొకరు గుర్తుతెలియని వ్యక్తి


మురళీరావు(ఫైల్)

ఆమదాలవలస: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం వేర్వేరు ఘటనల్లో రైళ్లు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్టు పలాస రైల్వే ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం గ్రామానికి చెందిన నానుపాత్రుని మురళీ రావు (54) ఊసవానిపేట రైల్వేగేట్ సమీపంలో గుర్తుతెలియని రైలుఢీకొని మృతి చెందాడు. మురళీరావు వాకింగ్ చేస్తూ రైల్వేట్రాక్ దాటుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా మురళీరావు పార్వతీపురం మన్యం జిల్లా బొండపల్లి మండల పంచాయతీ విస్తరణాధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. మురళీరావుకు భార్య కుమారి, ఇద్దరు కుమారులు ఉన్నారు. అలాగే ఇదే రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారం దగ్గరలో గుర్తుతెలియని రైలు ఢీకొని మరో వ్యక్తి చనిపోయాడు. ఆ వ్యక్తి వివరాలు తెలియకరాకపోగా సుమారు 50 ఏళ్ల వయస్సు ఉందని, ఆకుపచ్చ కలర్ షర్ట్, బూడిద కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. శవపంచనామా చేసి శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించి మృతదేహాన్ని భద్రపరిచినట్టు తెలిపారు. ఈయన వివరాలు తెలిసినవారు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. ఈ ప్రమాదాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రైల్వే ఎస్‌ఐ షరీఫ్ తెలిపారు.

కుమార్తె హత్యకేసులో తండ్రికి జీవిత ఖైదు

శ్రీకాకుళం క్రైం: కుమర్తెను హత్య చేసిన కేసులో ఓ తండ్రికి శ్రీకాకుళం మూడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు, ఫ్యామిలీ కోర్టు జీవిత ఖైదు విధిస్తూ బుధవారం తీర్పు చెప్పిన ఘటన జిల్లాలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆమదాలవలస పోలీసు స్టేషన్ పరిధి సొట్టవానిపేట టీబీఆర్ నగర్‌లో నివసిస్తున్న కొలుసు రామారావు తన భార్య సూర్యంపై అనుమానంతో తరచూ గొడవ పడేవాడు. ఈ క్రమంలో గతేడాది ఫిబ్రవరి 2వ తేదీన సూర్యంపై కత్తితో దాడి చేయబోగా, చిన్న కుమార్తె విజయ అడ్డుపడింది. దీంతో కోపోద్రిక్తుడైన రామారావు విచక్షణారహితంగా విజయపై కత్తితో దాడి చేసి చంపేశాడు. అలాగే భార్యపై కూడా దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఇది చూసిన కోడలు భారతి పెద్ద పెద్ద కేకలు వేయడంతో రామారావు అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిపై ఆమదాలవలస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాన కృష్ణచంద్ సాక్షాధారాలతో నిరూపించగా, ముద్దాయి రామారావుకు జీవిత ఖైదు, రూ.2500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది.

గడ్డివాము దగ్ధం

కంచిలి: పెద్దకొజ్జిరీయలో విద్యుత్ తీగలు తగిలి గడ్డిలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు బుధవారం సాయంత్రం నిప్పంటుకుంది. విషయం తెలుసుకున్న గ్రామస్థులు అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలను అదుపుచేశారు.

'ఆ స్కూల్‌పై చర్యలు తీసుకోండి'

శ్రీకాకుళం క్రైం: టెన్త్ పూర్తయిన తర్వాత తమ కళాశాలలోనే ఇంటర్ చదవాలని ఓ విద్యా సంస్థలో పని చేసేవారు ఒత్తిడి తెచ్చారు. దీంతో పదో తరగతి విద్యార్థిని సొమ్మసిల్లి పడిపోయింది. ఈ ఘటన సిక్కోలు నగరంలో చోటుచేసుకుంది. బాధిత తల్లిదండ్రులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్ (లేడీస్ క్యాంపస్)లో ఓ బాలిక పదో తరగతి చదువుతుంది. ఈ నెల 2న యథావిధిగా స్కూల్‌కు వెళ్లింది. ఆ బాలికతో పాటు మరో నలుగురు విద్యార్థినులను ఆ స్కూల్ రీజనల్ ఇన్‌చార్జి పిలిపించారు. టెన్త్ పూర్తయిన తర్వాత తమ సంస్థ బ్రాంచిలోనే ఇంటర్ చదవాలంటూ సూచించారు. ఈ ఐదుగురు విద్యార్థినులు మాత్రం తమ తల్లిదండ్రులు చేర్పించిన చోటే చదువుతామని తేల్చి చెప్పారు. మంగళవారం సదరు స్కూలు రీజనల్ ఇన్‌చార్జి ఐదుగురు విద్యార్థినులను నిల్చోబెట్టి ఒత్తిడి తేవడంతో ఓ విద్యార్థిని సొమ్మసిల్లి పడిపోయింది. బాలిక ఈ విషయం ఇంట్లో చెప్పడంతో ఆ బాలిక తండ్రి బుధవారం డీఈవో కె.వెంకటేశ్వరరావును కలిసి జరిగిన ఘటనను వివరించారు. ఆ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. డీఈవో మాట్లాడుతూ.. విద్యార్థులపై ఒత్తిడి తెస్తే సహించేది లేదన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపడతానని, రుజువైతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

అదుపుతప్పి పల్టీ కొట్టిన కారు

● జిల్లాకు చెందిన నలుగురుకి గాయాలు

● ఖమ్మం జిల్లాలో ఘటన



పల్టీ కొట్టిన కారు.. చికిత్స పొందుతున్న కవిత

కొణిజర్ల: ఖమ్మం జిల్లా కొణిజర్ల పోలీసు స్టేషన్ సమీపంలో బుధవారం ఉదయం ఓ కారు పల్టీ కొట్టిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాకుళం జిల్లా రణస్థలానికి చెందిన ఎస్.శశికుమార్ ఉద్యో రీత్యా కుటుంబంతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో స్వగ్రామానికి కుటుంబ సభ్యులతో కలిసి కారులో వస్తున్నాడు. కొణిజర్ల పోలీసు స్టేషన్‌కు సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి మూడు పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ తప్పా కారులో ప్రయాణిస్తున్న శశికుమార్, అతని భార్య కవిత, కుమారుడు పూనిత్, కుమార్తె వందన గాయపడ్డారు. వారిలో కవిత, వందనకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రులను కొణిజర్లలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి, అక్కడి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై వివరాలు సేకరిస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

పొందూరు: మండలంలోని ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను బదిలీచేస్తూ ఎంపీడీవో ఉత్తర్వులు జారీ చేశారు. అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్‌లో తాడివలస పంచాయతీ కార్యదర్శి బి.వెంకటరావును పెనుబర్తి పంచాయతీకి, పెనుబర్తి పంచాయతీ కార్యదర్శి బి.శ్రీనివాసరావును తాడివలస పంచాయతీకి బదిలీ చేశారు. గతంలో తాడివలస కార్యదర్శి వెంకటరావుపై సర్పంచ్ తమ్మినేని మనెమ్మ పలుమార్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం తెల్సిందే.

ఘనంగా నేషనల్ మేథ్స్ డే

ఇచ్ఛాపురం: నేషనల్ మేథమెటిక్స్ డే సందర్భంగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో క్విజ్, గణిత, రంగవల్లికలు, చిత్రలేఖనం, గణిత ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిజ జీవితంలో గణితం ప్రాధాన్యతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని ఇచ్ఛాపురం జీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయినులను సత్కరించారు.

పింఛన్ల పంపిణీ

కంచిలి: మండలంలో కొత్తగా మంజూరైన 157 పింఛన్లను జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీలో లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ఫైల దేవదాస్ రెడ్డి, జడ్పీటీసీ లోలాక్షి, ఎంపీడీవో ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యం


మాట్లాడుతున్న డీఆర్వో గణపతిరావు

కలెక్టరేట్: ఓటర్ల తుది జాబితాకు సంబంధించి రాజకీయ పార్టీల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తామని డీఆర్వో ఎం.గణపతిరావు అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల తుది జాబితాను ఈ నెల 22న విడుదల చేస్తామని, ఫారం 6, 7, 8లకు సంబంధించిన తుది పరిశీలన పూర్తయిందన్నారు. ఈ నెల 12వ తేదీ నాటికి అన్ని స్థాయిల్లో క్లెయిమ్‌లకు సంబంధించి పరిష్కారం లభిస్తుందన్నారు. సమావేశంలో పీఎంజే బాబు(టీడీపీ), రౌతు శంకరరావు(వైసీపీ), గోవింద మల్లిబాబు (కాంగ్రెస్), జి.రామారావు (బీఎస్పీ) తదితరులు పాల్గొన్నారు.


సోంపేట: మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం


టెక్కలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..


ఇచ్ఛాపురం రూరల్: కొలిగాం ఉన్నత పాఠశాలలో..

సావిత్రీబాయి పూలే ఆదర్శనీయం

దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జీవితం ఆదర్శనీయమని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. బుధవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

- ఆంధ్రజ్యోతి బృందం


ఎల్ఎన్ పేట: కేజీబీవీలో ఉపాధ్యాయినులను సన్మానిస్తున్న దృశ్యం


పలాస: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..


పలాస రూరల్: బ్రాహ్మణతర్లా హైస్కూల్‌లో..


పాతపట్నం: కొరసవాడ జడ్పీ హైస్కూల్‌లో..


కొత్తూరు: సిరుసువాడ యూపీ పాఠశాలలో..


జలుమూరు: బాలికల పాఠశాలలో..


పొందూరు: మజ్జిలపేట యూపీ పాఠశాలలో..


మందస: కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో..

చంద్రబాబుతోనే పంచాయతీల బలోపేతం

● జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్


మాట్లాడుతున్న సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు గొండు శంకర్

శ్రీకాకుళం, (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే పంచాయతీలు బలోపేతం అవుతాయని శ్రీకాకుళం ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ అన్నారు. మంగళగిరిలో ఓ ప్రైవేట్ కన్వెన్స్ హాల్‌లో బుధవారం ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో చంద్రబాబు ముఖ్యఅతిథిగా జరిగిన సర్పంచ్‌లు, ఎంపీటీసీల రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛమైన న్యాయమైన పరిపాలన సామర్థ్యం ఉన్న వ్యక్తి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అని, మేనిఫెస్టోలో స్పష్టమైన ఎజెండా పొందుపరిచారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిరంకుశ పాలన వల్ల పంచాయతీరాజ్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందన్నారు. ఈ పరిస్థితుల్లో స్థానిక సంస్థల ప్రతినిధులు టీడీపీని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, రాష్ట్ర పీఆర్ చాంబర్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, రాష్ట్రంలో అన్ని జిల్లాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● **ఇచ్ఛాపురం:** విజయవాడలో బుధవారం జరిగిన పంచాయతీ రాజ్ చాంబర్ సదస్సులో ఇచ్ఛాపురం నియోజకవర్గ టీడీపీ నాయకలు పాల్గొన్నారు. కార్యక్రమంలో నియోజవకర్గ టీడీపీ నాయకులు ఆసి నీలారాణి, పత్రి తవిటయ్య, బాసుదేవ రౌళో, జయదేవ, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన


నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ఆమదాలవలస: సమస్యలు పరిష్కారం కోరుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న స మ్మె బుధవారం నాటికి 9వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ప్రభుత్వ తీరును నిరసిస్తూ మున్సిపాలిటీ కార్మికులంతా అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.సంతోష్, కె.శ్రీనివాస్, కె.తారకేశ్వరరావు, కె.వెంకటరావు, కార్మికులు పాల్గొన్నారు.

భువనేశ్వరి పర్యటనకు చురుగ్గా ఏర్పాట్లు

జి.సిగడాం: దవళపేట గ్రామంలో మృతుడు కంచరాన అసిరినాయుడు కుటుంబాన్ని పరామర్శించేందుకు గురువారం రానున్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పర్యటనకు పార్టీ మండల నాయకుల ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాటు జరుగుతున్నాయి. భువనేశ్వరికి స్వాగతం పలికేందుకు, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మహిళలు, కార్యకర్తలు, నాయకులు, టీడీపీ కుటుంబ సభ్యులు భారీ సంఖ్యలో తరలిరావాలని నాయకులు కోరారు.

● **బూర్జ:** టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరి ఈ నెల 4న గురువారం తోటవాడ గ్రామం నుంచి కొల్లివలస జంక్షన్ మీదుగా నిమ్మతొర్లడ వెళ్లనున్నట్టు మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్ తెలిపారు. బుధవారం విలేకరులతో ఆయన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని కోరారు.

జేఎన్‌టీయూ క్రికెట్ జట్టు ఖరారు


ఎచ్చెర్ల: జేఎన్‌టీయూ (జీవీ) పరిధిలో క్రికెట్ జట్టును ఖరారు చేశారు. శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో రెండు రోజుల పాటు నిర్వహించిన ఎంపికలో వర్సిటీ తరపున తుది జట్టును ఖరారు చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.బాలాజీ తెలిపారు. ఈ జట్టులో డి.కులశేఖర్, వై.జ్ఞానతేజ (శ్రీశివానీ), ఐ.జాన్‌పాల్ (టెక్కలి), ఎం.సాయి యస్వంత్ (శ్రీవెంకటేశ్వర), వై.పవన్‌కుమార్, సీహెచ్ జయంత్, కె.యస్వంత్, బి.అభయ్ నాయుడు, సీహెచ్ వరుణ్‌తేజ్ రెడ్డి (విజయనగరం), ఎస్.తేజ, జె.జస్వంత్, డి.చైతన్య, టి.మోహన్ రిషి సాహిత్, వి.సాయి నాగ దినేష్, సీహెచ్ జయంత్, వి.సునీల్ (విశాఖ) ఉన్నారన్నారు. వీరంతా ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకు చెన్నైలో జరగనున్న సౌత్ జోన్ క్రికెట్ పోటీల్లో పాల్గొనున్నట్టు తెలిపారు.

బెదిరింపుల పాలనకు చరమగీతం: ఎంపీ


మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

బూర్జ: ఇటు ప్రజలను, అటు ఉద్యోగులను నిరంతరం భయపెడుతూ బెదిరిస్తూ కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడనున్నారని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. బుధవారం నీలాపురం, తుడ్డలి గ్రామాల్లో జరిగిన ప్రైవేట్ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకుడు కత్తెర నర్సింగరావును పరామర్శించి విలేకరులతో మాట్లాడారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారన్నారు. నారా లోకేష్ యువగళంతో వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు పిచ్చెక్కిపోయారన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ పేరుతో గ్రామాల్లో పర్యటిస్తున్న టీడీపీ నాయకులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఆయనతో పాటు తుడ్డలి సర్పంచ్ అంపిలి ప్రభావతి, బూర్జ ఎంపీడీసీ చొక్కార పోలినాయుడు, నాయకులు పీరుకట్ల విశ్వ ప్రభాకరరావు, గణపతిరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చైతన్య సభను విజయవంతం చేయాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎచ్చెర్ల: విశాఖలో ఈ నెల 7వ తేదీన బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్న బీసీ సామాజిక చైతన్య సదస్సును విజయవంతం చేయాలని ఈ సదస్సు కన్వీనర్ సువ్వారు రాజేష్ కుమార్ కోరారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను బుధవారం చిలకపాలెంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సువ్వారు సన్యాసిరావు, విజయనగరం ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దంచినాడ అప్పలసూరి, జిల్లా ఉపాధ్యక్షులు దేవ ఈశ్వరరావు, సత్యనారాయణ, శ్రీధర్ పాల్గొన్నారు.

సెక్టార్ ఇన్‌చార్జీలు బాధ్యతగా పనిచేయాలి

శ్రీకాకుళంక్రైం: రానున్న ఎన్నికల దృష్ట్యా ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో నియమితులైన సెక్టార్ ఇన్‌చార్జీలు బాధ్యతగా పనిచేయాలి ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎన్నికల విధి విధానాలపై ఎస్ఐ, సీఐ స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. వారికి కేటాయించిన సెక్టార్ పరిధిలోని పూర్తి సమాచారం స్వీకరించాలన్నారు. ప్రతిరోజూ సెక్టార్ పరిధిలో సందర్శించి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని, గడిచిన నాలుగున్నరేళ్లలో ఘటనలపై సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే పాత ముద్దాయిలను బైండోవర్ చేయాలన్నారు. ఆయా కేసులపై ఏదైనా సందేహాలు ఉంటే జిల్లాకు కేటాయించబడిన లీగల్ అడ్వైజర్‌ను సంప్రందిచాలని సూచించారు. వీలైనంత తొందరగా ఇంటర్ స్టేట్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ జె.తిప్పేస్వామి, జిల్లా పోలీసు లీగల్ అడ్వైజర్ ఎం.యామిని రాణి పాల్గొన్నారు.

సౌత్ జోన్ యూత్ ఫెస్టివల్‌కు ఎంపిక



యూత్ ఫెస్టివల్‌కు ఎంపికైన బృందంతో వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్

ఎచ్చెర్ల: ఆంధ్రా యూనివర్సిటీ (విశాఖ)లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు యువభేరి పేరిట జరగనున్న 37వ సౌత్ జోన్ యూత్ పెస్టివల్‌లో పాల్గొనేందుకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ బృందం ఎంపికైంది. సంగీతం, నృత్యం, థియేటర్ ఆఫ్ ఆర్ట్స్, ఫైన్ ఆర్ట్స్, సాహిత్యం విభాగాల్లో అంబేడ్కర్ వర్సిటీ బృందాలు పాల్గొనున్నాయి. ఆయా విభాగాలకు ఎంపికైన క్యాంపస్, అనుబంధ కళాశాలల విద్యార్థుల బుధవారం వర్సిటీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ బిడ్డిక అడ్డయ్యను కలిశారు. కార్యక్రమంలో సాంస్కృతిక వ్యవహారాల కన్వీనర్ ఎస్.ఉదయభాస్కర్, వర్సిటీ స్పోర్ట్స్ అసిస్టెంట్ డీన్ బీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

సరుబుజ్జిలి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 4వ తేదీ గురువారం నిర్వహించినట్టు ఎంపీడీవో పీవీ మురళీమోహన్‌కుమార్ తెలిపారు. ఎంపీపీ కిల్లి రమాదేవి అధ్యక్షతన ఆ రోజున మధ్యాహ్నం మూడు గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులతోపాటు పూర్తి వివరాలతో అన్ని శాఖల అధికారులు హాజరు కావాలన్నారు.

రూ.94.52 కోట్లు లబ్ధి

అరసవల్లి: జిల్లాలో 3,23,434 మందికి సామాజిక పింఛన్ కింద రూ.94.52కోట్లు లబ్ధి చేకూరుతుందని మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. బుధవారం ముఖ్యమంత్రి జగన్ వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరంలోని స్థానిక బాపూజీ కళామందిర్‌లో ఏర్పాటు చేసిన పింఛన్ కానుకలో మంత్రి ధర్మాన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, జేసీ ఎం.నవీన్ పాల్గొన్నారు.

మోదీ పథకాలతోనే దేశాభివృద్ధి

ఇచ్ఛాపురం: ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలతోనే దేశం అభివృద్ధి సాధిస్తుందని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ బుద్దాల నిర్మలా రెడ్డి అన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో వికసిత్ భారత్‌పై అవగాహన కల్పించారు. మొత్తం 17 పథకాలు ఉన్నాయని, దానిలో విశ్వకర్మ పథకం కింద 13 కుల వృత్తులు వారికి రుణాలు ఇస్తున్నట్టు తెలిపారు. దీనికి అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

మహిళలకు చేయూతనివ్వాలి

శ్రీకాకుళం క్రైం: స్వయం సహాయక బృందాల్లోని మహిళలు తయారు చేసిన ఉత్పత్తులకు చేయూతనివ్వాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు పిలుపు నిచ్చారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సిక్కోలు డ్వాక్రా బజార్ 2024ను బుధవారం మంత్రి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు డీవీ విద్యాసాగర్, లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.సూర్యకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి వేతనాలు ఇప్పించండి'

సరుబుజ్జిలి: ఉపాధి వేతనాలు ఆరు వారాలుగా అందలేదని, వెంటనే ఇప్పించాలని స్పీకర్ తమ్మినేని సీతారాంను పాలవలస గ్రామానికి చెందిన వేతనదారులు కోరారు. బుధవారం పాలవలస సచివాలయ పరిధిలోని పాలవలస కాలనీ, పెద్ద వెంకటాపురం గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో స్పీకర్ పాల్గొన్నారు. దీనిపై ఎంపీడీవో, ఏపీవోలను స్పీకర్ ప్రశ్నించగా నిధులు మంజూరు కాలేదని స్పష్టం చేశారు. కార్య క్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

● **ఆమదాలవలస:** పట్టణంలో బుధవారం నిర్వహించిన సామాజిక పింఛన్ల పంపిణీలో స్పీకర్ తమ్మినేని సీతారాం పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ పింఛన్లు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.రవిసుధాకర్, నాయకులు తమ్మినేని నాగ్, రమేష్‌కుమార్, ఉమామహేశ్వరావు తదితరులు ఉన్నారు.

శ్రీరాముడి పూజిత అక్షింతలు పంపిణీ



గార: అయోధ్యలోని శ్రీరాముడి పూజిత అక్షింతలు బుధవారం ఉదయం బూరవెల్లి గ్రామంలో ఊరేగింపుగా ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. గ్రామ పురోహితులు ఆరవెల్లి సీతారామస్వామి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపి నాయకులు పండి యోగీశ్వరరావు, భజరంగ్‌దళ్ కార్యకర్తలు బరాటం కల్కి, లీలాకృష్ణ ప్రవీణ్‌బాబు, వీహెచ్‌పీ జిల్లా కోశాధి కారి ధర్మవరపు ఆచారి తదితరులు పాల్గొన్నారు.

● **జి.సిగడాం:** అయోధ్య శ్రీరాముడి శోభయాత్రకు అక్షింతలు తయారు చేసేపనిలో ఆనందపురం భక్తులు నిమగ్నమయ్యారు. బుధవారం ఆ గ్రామంలోని రామాలయం వద్ద అక్షింతలను కలుపుతూ శోభయాత్రకు సిద్ధం చేస్తున్నారు.

● **ఇచ్ఛాపురం రూరల్:** అయోధ్య రాముడి పూజిత అక్షింతలు బూర్జపాడు గ్రామంలో దున్న ఆనంద్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు దున్న ఢిల్లీరావు, దున్న నారాయణ, శివంగి గణపతి, ఎస్.ఆదినారాయణ, పాలేపు శ్రీరాములు, దున్న గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.